సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం, 22, ఆగస్టు, 2022



సెంటర్‌స్ప్రెడ్‌లో..

ఒకరికి ఒకరు తోడుగా..

వారంతా విశ్రాంత పోలీసులు. సంఘం ఏర్పాటు చేసుకుని ఒకరి ఒకరు తోడుగా.. నిలుస్తున్నారు. ఉద్యోగుల సేవా సంఘం ఏర్పాటుకు పసుపులేటి తారయ్య నాంది పలికారు.

గణపతికి వీర భక్తుడు ఈ తాపీమేస్త్రి

- సొంతఖర్చుతో మండపాలు, విగ్రహాల తయారీ
- ఏటా లక్షల్లో ఖర్చు...



సెంటర్‌స్ప్రెడ్‌లో..



216 కిలోల గంజాయి పట్టివేత

- నలుగురి అరెస్టు

3లో

గెడ్డ దాటుతూ మామ, కోడలు మృతి

- నాటు వైద్యం కోసం పక్క గ్రామానికి వెళ్లే క్రమంలో ప్రమాదం
- గిన్నెలకోటలో విషాదఛాయలు



లక్ష్మయ్య, సత్యవతి మృతదేహాలు

పెదబయలు: ఆరోగ్యం బాగోలేక పోవడంతో నాటు వైద్యం కోసం పక్క గ్రామానికి వెళ్లే క్రమంలో గెడ్డదాటుతూ కొట్టుకుపోయి మామ,కోడలు మృతి చెందారు. మండలంలోని మారుమూల గిన్నెలకోట గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. మృతుల కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గిన్నెలకోట గ్రామానికి చెందిన మామా,కోడలైన మనుగూరు లక్ష్మయ్య(45), మనుగూరు సత్యవతి(28) రెండు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నారు. ఇదే పంచాయతీ లుండూలు గ్రామంలో నాటు వైద్యం వేయించుకోడానికి వీరు ఆదివారం మధ్యాహ్నం బయలు దేరారు. ఎగువ ప్రాంతాలైన గోమంగి,గుల్లేలు,పోయిపల్లిల్లో భారీగా వర్షాలు కురవడంతో గిన్నెలకోట గెడ్డలో మిగతా 2వ పేజీలో ▸

గ్రాస్ ల్యాండ్ హిల్స్‌కు మహర్దశ



గుడిసె గ్రామం వద్ద గ్రాస్‌ల్యాండ్ హిల్స్‌పై టెంట్లు

ఏజెన్సీలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. కాటేజీల నిర్మాణంతో పాటు ఇతర వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. మారేడుమిల్లి, రంపచోడవరం మండలాల్లోని పర్యాటకేంద్రాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మరికొన్ని పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపారు.

- రూ. 2.45 కోట్ల వ్యయంతో కాటేజీల నిర్మాణం
- మారేడుమిల్లిలోనూ టూరిజం కాటేజీలకు ప్రతిపాదనలు
- ఐ.పోలవరం వద్ద పార్కు నిర్మాణం

రంపచోడవరం : తూర్పు కనుమల్లో మారేడుమిల్లి ఏజెన్సీలో ఉన్న గుడిసె గ్రామం వద్ద గల కొండలపై ప్రకృతి అందాలు చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తారు. ఎత్తైన కొండలపై ఉన్న గడ్డి మైదానాలు, పర్వత శిఖరాలను తాకుతూ వెళ్లే మేఘాల సోయగాలను తిలకించేందుకు రెండు కళ్లూ చాలవు. మారేడుమిల్లికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుడిసె గ్రామాన్ని చేరుకునేందుకు అడవుల మధ్యలో నుంచి ప్రయాణం చేయాలి. తెల్లవారు జామున కనువిందు చేసే అందాలను చూసేందుకు ముందురోజు రాత్రే అక్కడకు చేరుకుని, గ్రాస్ ల్యాండ్ హిల్స్‌పై టెంటుల్లో బస చేస్తారు. కొంత మంది మారేడుమిల్లిలోని అతిథి గృహాల్లో బస చేసి, అద్దె వాహనాల్లో తెల్లవారు జామున అక్కడకు చేరుకుంటారు. టెంటుల్లో బస చేస్తున్న పిల్లలు, మహిళలకు కొంత భద్రత సమస్య ఏర్పడుతోంది. దీంతో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా వసతులు కల్పించేందుకు ఐటీడీఏ అధికారులు సంకల్పించారు. కాటేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం రూ.2.45 కోట్లు ఖర్చుచేయనున్నారు. పనులు చేపట్టేందుకు ఇప్పటికే శంకుస్థాపన చేశారు. కాటేజీల నిర్మాణం పూర్తయితే గుడిసె గ్రామాని వచ్చే పర్యాటకుల సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉంది. మహిళలు, చిన్నారులు సైతం అక్కడ బస చేయవచ్చు. పర్యాటకుల భద్రతతో పాటు రాత్రి వసతి అందుబాటులోకి వస్తుంది. మారేడుమిల్లి మండల కేంద్రంలో ది ఉడ్స్ కాటేజీ తరహాలో మరో ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

ఐపోలవరం వంతెన వద్ద...

రంపచోడవరం మండలం ఐ పోలవరం వంతెన ప్రాంతాన్ని రూ. 1.03 కోట్లు, రూ. 51 లక్షల వ్యయంతో రెండు ప్యాకేజీల కింద పర్యాటక శాఖ సుందరంగా తీర్చిదిద్దనుంది. ఐ పోలవరం బ్రిడ్జి కింద నుంచి సీతపల్లి వాగు ప్రవహిస్తుంది. రంపచోడవరానికి ఏడు

మిగతా 2వ పేజీలో ▸

అవిగవిగో ఏటి కుక్కలు!

- కొండకర్ల ఆవ వద్ద వెలుగులోకి..
- అంతరించిపోతున్న అరుదైన జాతి
- ఉమ్మడి విశాఖ జిల్లాలో బయటపడడం ఇదే తొలిసారి
- వీటి సంరక్షణకు ఈస్ట్‌కోస్ట్ కన్జర్వేషన్ టీమ్ సన్నాహాలు



కొండకర్ల ఆవలో డిజిటల్ కెమెరాలకు చిక్కిన ఏటి కుక్కలు



ఏటి కుక్క (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: ఏటి కుక్కలను ఎప్పుడైనా చూశారా? వాటి పేరైనా విన్నారా? ఏ కొద్దిమందికో తప్ప వీటి గురించి అసలు తెలియనే తెలియదు. ఎందుకంటే ఇవి అంతరించిపోతున్న జాతుల జాబితాలో ఉన్నాయి. అలాంటి అత్యంత అరుదైన ఏటి కుక్కలు మన ఉమ్మడి విశాఖ జిల్లా (ప్రస్తుత అనకాపల్లి జిల్లా)లోని అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవలో ఉన్నట్టు వెలుగులోకి వచ్చాయి. అక్కడే అవి ఆవాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటివరకు కృష్ణా రివర్ బేసిన్‌లోను, తూర్పు గోదావరి జిల్లా కోరింగ మడ అడవుల ప్రాంతంలోనూ ఇవి ఉనికిలో ఉన్నాయి. తాజాగా కొండకర్ల ఆవలోనూ ఇవి మనుగడలో ఉన్నట్టు ఈస్ట్ కోస్ట్ కన్జర్వేషన్ టీమ్ (ఈసీసీటీ), గ్రీన్ పా సంస్థలు గుర్తించాయి.

కెమెరాతో బంధించి..

ఏటి కుక్కలు పగటి పూట మనుషులకు కనిపించే పరిస్థితి లేకపోవడంతో కొండకర్ల ఆవలో వాటి జాడ తెలుసుకోవడానికి మూడు చోట్ల ఈసీసీటీ సభ్యులు ప్రత్యేక డిజిటల్ కెమెరాలను అమర్చారు. కొన్ని రోజులకు అవి ఈ కెమెరాలకు చిక్కాయి. దీంతో వాటిని అంతరించిపోతున్న ఏటి కుక్కలు (స్మూత్ కోటెడ్ ఆటర్స్)గా నిర్ధారణకు వచ్చారు. ఇందుకోసం నలుగురు ఈసీసీటీ, గ్రీన్ పా సభ్యులు దాదాపు నాలుగు నెలల పాటు అధ్యయనం చేశారు. ఇక్కడ అరుదైన ఏటి కుక్కల జాడ గురించి ఇటీవల ఐయూసీఎన్/ఎస్‌ఎస్‌సీ ఆటర్ స్పెషలిస్టు గ్రూప్ బులెటిన్ (జర్నల్)లోనూ ప్రచురించారు.

ఏమిటీ ఏటి కుక్కలు?

ఏటి కుక్కలు ముంగిసను పోలిన ఆకారంలో వాటికంటే పెద్దగా, ఊరకుక్కలకంటే చిన్నవిగా ఉంటాయి. నీటిలోనే ఎక్కువగా మనుగడ సాగిస్తాయి. ఈదుకుంటూ తిరుగుతుంటాయి. నదులు, సరస్సులుండే ప్రాంతాల్లో ఇవి నివశిస్తాయి. 37–43 సెం.మీల తోక, 59–64 సెం.మీల పొడవుతో, 7–11 కిలోల బరువును మిగతా 2వ పేజీలో ▸

నేడు అల్లూరి తిరుగుబాటు శతాబ్ది ఉత్సవాలు



చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై అల్లూరి దాడి చేసిన దృశ్యం(ఊహాచిత్రం)

- చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి వందేళ్లు
- ఈ సందర్భంగా నిర్వహించనున్న సభకు హాజరు కానున్న పలువురు మంత్రులు

స్వాతంత్ర్య ఉద్యమంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామారాజుది చెరగని ముద్ర. ఆయన చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి వందేళ్లు అయిన సందర్భంగా సోమవారం చింతపల్లిలో భారీ బహిరంగ నిర్వహించనున్నారు.1922 ఆగస్టు 22న 300 మంది అనుచరులతో దాడి చేసి తుపాకులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన జరిగి సోమవారానికి సరిగ్గా వందేళ్లు అవుతున్న సందర్భంగా తిరుగుబాటు శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు.

- వార్తలు మెయిన్, టాబ్లాయిడ్ 8లో

ఏసీ రిపేరు పేరుతో దోపిడీ

- ఐదు తులాల బంగారం చోరీ
- అనకాపల్లి పట్టణంలో ఘటన
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన క్రైం ఎస్పీ లక్ష్మీనారాయణ

- 3లో

క్లుప్తంగా...

అనంత బాబుకు మాతృ వియోగం



మంగారత్నం (ఫైల్)

కాకినాడ/రంపచోడవరం: ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ (అనంత బాబు) తల్లి మంగారత్నం (69) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. కొద్ది రోజులుగా అస్వస్థతతో బాధ పడుతున్న ఆమె కాకినాడ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆమెకు కుమారుడు ఎమ్మెల్సీ అనంత బాబు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మంగారత్నం భర్త మాజీ ఎంపీపీ అనంత చక్రరావు గతంలో మావోయిస్టుల చేతిలో హత మయ్యారు. ఏజెన్సీలో మంచి పట్టున్న నాయకుడు చక్రరావు.

స్వగృహానికి మృతదేహం

అనంత మంగారత్నం మృతదేహాన్ని కాకినాడ శ్రీరామ్ నగర్‌లోని అనంతబాబు నివాసానికి తరలించారు. ఆమె పార్థివ దేహానికి కుటుంబ సభ్యులు నివాళులర్పించారు.

అంత్యక్రియలకు అనంతబాబు

తల్లి అంత్యక్రియలకు అనంత బాబు హాజరయ్యే అవకాశం ఉంది. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న ఆయన.. అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వీలుగా అధికారుల అనుమతి కోసం ప్రయత్నిస్తున్నారు. ఆయనకు మధ్యంతర బెయిల్ వచ్చిన అనంతరం మంగారత్నం అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బెంగళూరు-షాలిమార్ మధ్య ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): బెంగళూరు-షాలిమార్-బెంగళూరు మధ్య స్పెషల్ రైలు సింగిల్ ట్రిప్ నడిపేందుకు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే నిర్ణయించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. శ్రీమోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ (ఎస్ఎంవీటీ) బెంగళూరు-షాలిమార్ (06597) సూపర్‌ఫాస్ట్ స్పెషల్ రైలు బెంగళూరులో ఈనెల 24న ఉదయం 10.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు గురువారం తెల్లవారు 4.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 4.40 గంటలకు బయల్దేరి అదే రోజు సాయంత్రం 6.15 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో షాలిమార్-శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు(06598) సూపర్‌ఫాస్ట్ స్పెషల్ రైలు షాలిమార్‌లో ఈనెల 26న మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి మధ్యరాత్రి 01.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి మధ్యరాత్రి 2.05 గంటలకు బయల్దేరి శనివారం రాత్రి 8.00 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): రోటరీక్లబ్ విశాఖ వేలీ సహకారంతో జపాన్‌కు చెందిన ఎల్ ఏంజెల్ ఇంటర్నేషనల్ వలంటరీ అసోసియేషన్ మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేసింది. అసోసియేషన్ ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ ఎంవీ జానకీరామ్ చొరవతో ఈ సహాయాన్ని నగరంలోని వివిధ పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం రోటరీక్లబ్ విశాఖ వేలీ అధ్యక్షుడు ధర్మసాయి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. రోటరీ పూర్వ గవర్నర్ విశ్వనాథ్ పాల్గొని విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్య సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఎల్.వేణుగోపాల్ మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ కీలకమైందని, సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నర్సింగరావు

పాడేరు రూరల్: వైఎస్సార్‌సీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యాలయం నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. పాడేరు మండలం చింతలవీధి పంచాయతీ నడిమివీధి మెట్ట వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయం నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం ఆదివారం ఉదయం 8గంటలకు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు దంపతులు, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు శంకుస్థాపన చేశారు. త్వరలో కార్యాలయం నిర్మాణం పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. కొత్తగా ఏర్పడిన అల్లూరి సీతారామరాజు జిల్లాలో పార్టీ కార్యాలయం నిర్మాణానికి చర్యలు తీసుకున్న పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సొనారి రత్నకుమారి, పాడేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మత్స్యరాస గాయత్రిదేవి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్‌పర్సన్ సరస్వతి, స్థానిక సర్పంచ్ సీతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు గిడ్డి విజయలక్ష్మి, సర్పంచులు సీదరి రాంబాబు, గబ్బాడ చిట్టిబాబు, వంతాల రాంబాబు, వనుగు బసవన్నదొర, లకే పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యులు చల్లా చిట్టమ్మ, లకే రామకృష్ణ పాత్రుడు, కె.నర్సింహమూర్తి, మాజీ ఎంపీపీలు సీదరి మంగ్లన్నదొర, ఎస్వీవీ రమణమూర్తి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీల భూ తగాదాలను పరిష్కరించాలి

- ఆదివాసీ వికాస పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా బొంజునాయుడు



మాట్లాడుతున్న ఆదివాసీ వికాస పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా బొంజునాయుడు

పాడేరురూరల్: జిల్లాలో కొన్నేళ్లుగా గిరిజనులు ఎదుర్కొంటున్న భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదివాసీ వికాస పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా బొంజునాయుడు కోరారు. ఆదివారం ఆయన పాడేరులో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య భూ వివాదాలు అధికమవుతున్నాయని, ఇందుకు రెవెన్యూశాఖలో కొంత మంది సిబ్బందే కారణమని ఆయన ఆరోపించారు.

గిరిజనులకు చెందిన పట్టా భూములు సైతం గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. పాడేరు మండలంలోని చింతలవీధి పంచాయతీ భీమసింగి, గుత్తులపుట్టు పంచాయతీ దబ్బాపుట్టు గ్రామంలో చోటు చేసుకున్న భూ వివాదాలకు రెవెన్యూ సిబ్బందే కారణమన్నారు. ఉన్నతాధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేసిన సకాలంలో స్పందించడం లేదని చెప్పారు. ఈ వివాదాన్ని రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ వికాస పరిషత్ జిల్లా అధ్యక్షుడు బూడిదె చిట్టిబాబు, జిల్లా కార్యనిర్వాహక సభ్యులు శ్రీరామ్, లకే రామకృష్ణ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

అవిగవిగో ఏటి కుక్కలు!

▶ 1వ పేజీ తరువాయి

కలిగి ఉంటాయి. పగటి పూట మనుషులకు కనిపించకుండా మడ అడవులు, జమ్ము గడ్డి వంటి దట్టంగా ఉండే ప్రాంతాల్లోను, గట్లకు చిన్నపాటి గోతులు చేసుకుని వాటిలో ఆవాసం ఏర్పాటు చేసుకుంటాయి. రాత్రి వేళ నదులు/సరస్సుల్లోని చేపలను ఎక్కువగా తింటాయి. అప్పుడప్పుడు పాములు, పక్షులను కూడా ఆహారంగా చేసుకుంటాయి.

సంతతి పెరుగుతోంది..


కొండకర్ల ఆవలో ఏటి కుక్కల జాడ వెలుగు చూడడం ఒక విశేషమైతే వాటి సంతతి పెరుగుతుండడం మరో విశేషం. ఇక్కడ ఆరేడేళ్ల క్రితంకంటే ఇప్పుడు ఎక్కువ సంఖ్యలో కనిపిస్తున్నాయని ఆవలో చేపలవేట సాగించే మత్స్యకారులు చెబుతున్నారు. అయితే ఇవి మనుషులకు ఎలాంటి హాని చేయనందువల్ల వీటిని చూసి వీరు భయపడం లేదు. కానీ వలలో పడిన చేపలను తినడానికి వలలను పాడు చేస్తుండడంతో వీరికి నష్టాన్ని చేకూరుస్తున్నాయి.

అవి అరుదైన ఏటి కుక్కలే..

కొండకర్ల ఆవలో వెలుగులోకి వచ్చిన ఏటి కుక్కలు అంతరించి పోతున్న జాతులకు చెందినవే. ఇవి ఇప్పటివరకు రాష్ట్రంలో కోరింగ మడ అడవులు, కృష్ణా రివర్ బేసిన్ తదితర ప్రాంతాల్లోనూ ఉంటున్నట్టు గుర్తించారు. ఏటి కుక్కలు ఈ ఆవలో మనుగడ సాగించడానికి అనువైన ప్రాంతం. మనుషుల నుంచి వీటికి హాని జరగకుండా సంరక్షించాల్సిన అవసరం ఉంది.

–అనంత శంకర్, డీఎఫ్ఓ, విశాఖపట్నం


'విశాఖ'లో తొలి రికార్డు..



కొండకర్ల ఆవలో ఏటి కుక్కల ఉనికి వెలుగు చూడడం ఉమ్మడి విశాఖ జిల్లాలో తొలి రికార్డు. దేశంలో ఇలాంటివి మూడు జాతులుండగా రాష్ట్రంలో కనిపించిన ఈ జాతి ఒకటి. అంతరించిపోతున్న ఈ జాతిని సంరక్షించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నాం. వీటి ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తాం. ఆవలో వాటి సంఖ్య, శారద, వరాహ నదుల్లో వాటి ఉనికి తెలుసుకోవడంపై దృష్టి సారిస్తున్నాం.

–శ్రీచక్ర ప్రణవ్, మెరైన్ బయాలజిస్టు, ఈసీసీటీ టీమ్

ఆవ అనుకూలం..



కొండకర్ల ఆవ ఏటి కుక్కలకు అనుకూలంగా ఉంది. ఇక్కడ ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండడంతో చేపల లభ్యత బాగుంటుంది. అందుకే ఈ ప్రాంతం ఏటి కుక్కలకు అనువైనదే కాకుండా ఆహారం దొరుకుతుంది. గతంకంటే ఇక్కడ వీటి సంతతి పెరుగుతోంది. ఇవి మనుషులకు హాని చేయకపోయినా వలలను, వాటిలో పడ్డ చేపలను తినేస్తుండడం వల్ల నష్టం వాటిల్లుతోంది.

–సాయి, కొండకర్ల ఆవ మత్స్యకారుడు

గ్రాస్ ల్యాండ్ హిల్స్‌కు మహర్దశ



ఐ పోలవరం బ్రిడ్జి వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి (ఫైల్)

▶ 1వ పేజీ తరువాయి

కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతాన్ని పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శిస్తున్నారు. దీంతో ఇక్కడకు వచ్చే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో పార్కు ఏర్పాటు, పర్యాటకులు కూర్చునేందుకు హట్‌ల నిర్మాణాలు, మరుగుదొడ్లు, కాలువ వద్ద మెట్లు నిర్మాణం వంటివి చేయనున్నారు. ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇటీవల రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శంకుస్థాపన చేశారు.

రెండు వారాల్లో పనులు ప్రారంభం

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఐ పోలవరం బ్రిడ్జి వద్ద అభివృద్ధి పనులు రెండు వారాల్లో ప్రారంభిస్తాం. ఇప్పటికే చదును చేసే పనులు, సర్వే పూర్తి చేశారు. వర్షాలు పడడంతో పనులు ప్రారంభం కాలేదు. ఇక్కడకు వచ్చిన పర్యాటకులకు అన్ని వసతులు కల్పిస్తాం.

–సత్యనారాయణ, డీఈ, టూరిజంశాఖ

గెడ్డ దాటుతూ మామ, కోడలు మృతి



ఉధృతంగా ప్రవహిస్తున్న గిన్నెలకోట గెడ్డ

▶ 1వ పేజీ తరువాయి

నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. ఈ విషయం గమనించని వారు గెడ్డ దాటేందుకు ప్రయత్నించి, కొట్టుకుపోయారు. గెడ్డలో కొట్టుకుపోతూ పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు విని, వెంటనే కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. గాలింపు చర్యలు చేపట్టడంతో కిలోమీటరు దూరంలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మనుగూరు లక్ష్మయ్యకు భార్యాపిల్లలు ఉన్నారు. మనుగూరు సత్యవతికి భర్త సూకరాజు,ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెండడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయంపై పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్‌ను సంప్రదించగా మృతుల కుటుంబ సభ్యుల నుంచి ఫోన్ సమాచారం అందినట్టు చెప్పారు. సోమవారం ఉదయం మృతదేహాలను గెడ్డదాటించి, పోస్టుమార్టం నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిన్నెలకోట సమీపంలో గెడ్డపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. వంతెన నిర్మాణం టెండరు దశలో ఉంది.

దత్తాత్రేయునికి తైలాభిషేకం

అనకాపల్లి టౌన్: మండలంలో జాతీయ రహదారి సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఆదివారం దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం నిర్వహించారు. ఆలయంలో తెల్లవారుజామునుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ఆలయ నిర్వాహకులు ఆంజనేయమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

216 కిలోల గంజాయి పట్టివేత



నిందితులతో సీఐ సుధాకర్, ఎస్ఐలు

సాక్షి,పాడేరు: ఖరీదైన స్కోడా కారులో తరలిస్తున్న 216 కిలోల గంజాయి పట్టుకున్నట్టు పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు. పాడేరు ఎస్ఐ లక్ష్మణ్, రంజిత్‌లకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం పాడేరు–చోడవరం ప్రధాన రహదారిలోని 12వ మైలురాయి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటు వైపుగా వస్తున్న స్కోడా కారు తనిఖీ చేయగా 216 కిలోల గంజాయి లభ్యమైందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని స్కోడా కారుతో పాటు ఫైలట్‌గా ఉపయోగించిన పల్సర్ బైక్‌ను సీజ్ చేశామన్నారు. గంజాయి తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన లక్ష్మణ జిటే, సుబనుల్ల, తన్విర్ గులాంతో పాటు ఫైలట్‌గా వ్యవహరించిన ముంచంగిపుట్టుకు చెందిన కిరసాని మహేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వారు వద్ద నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాలువలో పడి ఆవు మృతి



కాలువలో ఇరుక్కుపోయి మృతి చెందిన ఆవు

బుచ్చెయ్యపేట(చోడవరం): మండలంలోని సీతయ్యపేటలో పాడి ఆవు కాలువలో పడి మృతి చెందింది. గ్రామానికి చెందిన అల్లు శ్రీను తన పాడి ఆవును ఆదివారం మేతకు తీసికెళ్లి పాకకు తీసుకు వస్తున్నాడు. సీతయ్యపేట మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న కాలువను దాటుతుండగా ఆవు ప్రమాదవశాత్తు కాలువలోకి జారిపోయి ఇరుక్కుపోయింది. ఊపిరి ఆడక మృతి చెందింది. స్థానికులు కాలువలో ఇరుక్కున్న ఆవును పొక్లెయిన్ సాయంతో బయటకు తీయగా అప్పటికే మృతి చెందింది. పాలిచ్చే ఆవు మృతి చెందడంతో సుమారు రూజ 60 వేలు నష్టం జరిగిందని బాధితుడు వాపోతున్నాడు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మాకవరపాలెం(నర్సీపట్నం): గుర్తు తెలియని కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని పెద బొడ్డేపల్లికి చెందిన దొంకిన రమణ మండల కేంద్రంలోని శ్రీదేవి ఫంక్షన్ హాల్ పక్కన ఉన్న ఒక కారం మిల్లులో పనిచేస్తున్నాడు. అయితే ఆదివారం రాత్రి మిల్లు ఎదురుగా ఉన్న రోడ్డు దాటుతుండగా నర్సీపట్నం నుంచి విశాఖవైపు వెళుతున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో రమణ తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, పరారైన కారు కోసం గాలిస్తున్నారు.

అదనపు కట్నం కోసం చిత్రహింసలు

భర్త, అత్తమామలు, ఆడపడచు వేధింపులపై వివాహిత ఫిర్యాదు



బాధితురాలి ఆరోగ్యంపై ఆరా తీస్తున్న తల్లి, సోదరి

యలమంచిలి: పెళ్లయిన నాటి నుంచి అదనపు కట్నం కోసం వేధించడమే కాకుండా హత్యాయత్నానికి పాల్పడ్డారని ఓ వివాహిత వాపోయింది. ఈ విషయమై ఫిర్యాదు చేసినా పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆమె ఆరోపించింది. అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... రాంబిల్లి మండలం పెదకలవలాపల్లికి చెందిన నాగమణి అలియాస్ శిరీషకు 2009 జూన్ 17న యలమంచిలి పట్టణం ధర్మవరం గ్రామానికి చెందిన సూరకాసుల నానాజీతో వివాహమైంది. ఆ సమయంలో రూ.10 లక్షలు, 15 తులాల బంగారం, కేజీ వెండి, ద్విచక్ర వాహనం, రూ.రెండు లక్షల విలువైన సారె తమ పుట్టింటివారు కట్నంగా ఇచ్చారని నాగమణి పేర్కొంది. అయినప్పటికీ తనను తరచూ భర్త, అత్తమామలు, కుటుంబ సభ్యులు అదనపు కట్నంకోసం, ఐదు ఎకరాలు భూమి కావాలని వేధించేవారని తెలిపింది. వేధింపులు తమ పుట్టింటివారికి తెలియడంతో మూడున్నర ఎకరాల భూమి తన పేరిట రాశారని ఆమె వివరించింది. ఆ తరువాత రెండు నెలలు బాగానే చూసుకున్నారని, కొన్నాళ్ల తర్వాత మళ్లీ అదనపు కట్నం తేవాలని వేధించడం మొదలుపెట్టారని పేర్కొంది. దీంతో పది తులాల బంగారం, మరో రూ.3 లక్షల సామగ్రి పుట్టింటివారు ఇచ్చారని, అయినప్పటికీ వేధింపులు ఆపలేదని బాధితురాలు పేర్కొంది. ఇంట్లో తిండి కూడా పెట్టేవారు కాదని, ఆకలితో ఎన్నోరోజులు అలమటించానని ఆమె ఫిర్యాదులో తెలిపింది. పుట్టింటివారు ఇచ్చిన మూడున్నర ఎకరాల భూమి విక్రయించి డబ్బులు తేవాలని హింసించేవారని, ఇందుకు తాను అంగీకరించకపోవడంతో అడ్డుతొలగించేందుకు అతికిరాతకంగా ప్రవర్తించారని ఆమె పేర్కొంది. ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి దాటాక భర్త సూరకాసుల నానాజీ, ఆడపడచు మంగతాయారు, మరో నలుగురు కుటుంబ సభ్యులు హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆమె ఫిర్యాదులో వివరించింది. ఊపిరాడకుండా పట్టుకుని బలవంతంగా నోట్లో టాయిలెట్ క్లీనర్ ద్రావణాన్ని పోసి తాగించారని, బతిమలాడినా కనికరించలేదని ఆమె పేర్కొంది. వెంటనే రక్తపు వాంతులు అయ్యాయని వాపోయింది.దీంతో ఆర్ఎంపీ వైద్యుడిని ఇంటికి తీసుకొచ్చి చికిత్స చేయించాలని చూశారని.. తన పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో భయంతో ఆ వైద్యుడు వెళ్లిపోయాడని చెప్పింది. ఆ రోజు ప్రైవేటు ఆస్పత్రిలో చూపించి మళ్లీ ఇంట్లో బంధించారని తెలిపింది. మరుసటి రోజు మధ్యాహ్నం అన్నయ్య కనకారావు, కుటుంబీకులు యలమంచిలి వచ్చి గదిలో బంధించి ఉంచిన తనను పుట్టింటికి తీసుకెళ్లారని నాగమణి వివరించింది. ఈ నెల 17న యలమంచిలి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేశారని, అక్కడి వైద్యుల సూచనల మేరకు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఆస్పత్రిలో చేర్పించారని బాధితురాలు వెల్లడించింది.

పట్టించుకోవడం లేదు

వేధింపులు, హత్యాయత్నం కేసులో నిందితులకు పోలీసులు కొమ్ముకాస్తున్నారని బాధితురాలి సోదరుడు యలమంచిలి కనకారావు ఆరోపించారు. కేసు దర్యాప్తు గురించి పట్టణ ఎస్ఐని అడిగితే నిందితులు ఎక్కడున్నారో చెప్పాలని తిరిగి తమను అడుగుతున్నారని ఆయన ఆరోపించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఎంతో పాటు డీజీపీకి ఫిర్యాదు చేస్తామని కనకారావు పేర్కొన్నారు. దీనిపై ఎస్ఐ అమ్మనరావును వివరణ కోరగా కేసు వివరాలు డీఎస్పీని అడిగి చెబుతామన్నారు.

మత్తులో పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి





దాడిలో గాయపడిన బంక్ సిబ్బంది గోవింద్, కాశీ

నర్సీపట్నం: తెల్లవారుజామున తాగిన మైకంలో వచ్చిన వారికి పెట్రోల్ వేయలేదనే సాకుతో బంక్ సిబ్బందిని చితకబాదారు. నర్సీపట్నం మున్సిపాలిటీ శారదనగర్‌లో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి టౌన్ ఎస్ఐ గోవిందరావు తెలిపిన వివరాలు... శారదనగర్ వైజంక్షన్‌లో భారత్ పెట్రోల్ బంకు ఉంది. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వచ్చి పెట్రోల్ వేయాలని అడిగారు. ఆ సమయంలో వారు మద్యం తాగి ఉండటంతో డబ్బులు ఇస్తేనే పెట్రోల్ పోస్తామన్నారు. మమ్మలనే డబ్బులు అడుగుతారంటూ మద్యం మత్తులో ఉన్న ముగ్గురు వ్యక్తులు దౌర్జన్యంగా సిబ్బంది నిద్రిస్తున్న రూమ్ తలుపు తోసుకుని లోపలకి వెళ్లి సిబ్బంది గొర్లి గోవింద్, కాశీలను విచక్షణరహితంగా చితకబాదారు. దీనిపై ఆదివారం బంక్‌సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంక్‌లోని సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా దాడి చేసిన వారు పట్టణానికి చెందిన బొగ్గు సాయి కార్తీక్, పెట్ల చైతన్య, అబ్దుల్ రహీంగా పోలీసులు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవిందరావు తెలిపారు. ప్రస్తుతం దాడి చేసిన ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని.. వారి కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు.

ఏసీ రిపేరు పేరుతో దోపిడీ

- ఐదు తులాల బంగారం చోరీ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన క్రైం ఎస్పీ లక్ష్మీనారాయణ

అనకాపల్లిటౌన్: సినీ ఫక్కీలో గుర్తు తెలియని వ్యక్తి వృద్ధ దంపతులు ఇంట్లోకి చొరపడి ఐదు తులాల బంగారం చోరీకి పాల్పడ్డాడు. పట్టణ సీఐ దాడి మోహన్‌రావు అందించిన వివరాలు... కస్పావీధిలో నివసిస్తున్న దంపతులు సత్యనారాయణ, ఈశ్వరమ్మ ఇంటికి శనివారం రాత్రి సమయంలో ఏసీ రిపేరు చేయాలని మీ కుమారుడు సంతోష్ చెప్పినట్టు సుమారుగా 35 నుంచి 40 ఏళ్ల వ్యక్తి వచ్చాడు. దీంతో సత్యనారాయణ తమ కుమారునికి ఫోన్ చేస్తామని చెబుతున్న సమయంలో అతని మెడలో ఉన్న ఐదు తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయినట్టు సీఐ చెప్పారు. ఘటనా స్థలానికి జిల్లా క్రైం ఎస్పీ లక్ష్మీనారాయణ చేరుకుని చోరీ జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. సత్యనారాయణ కుమారుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సింహగిరిపై ఘనంగా ఉట్ల సంబరం



ఉట్టిని అందుకుంటున్న యాదవులు

- శ్రీకృష్ణాలంకారంలో దర్శనమిచ్చిన అప్పన్న
- పరవశించిన భక్తజనం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామి ఆదివారం శ్రీకష్ణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. సింహగిరిపై జరుగుతున్న శ్రీకష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సాయంత్రం ఉట్ల సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాన్ని కనులారా తిలకించారు. ఆనంద డోలికల్లో మునిగితేలారు. సాయంత్రం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి శ్రీకష్ణాలంకరణ చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో వేంజేంపచేశారు. తొలుత ఆలయ బేడా తిరువీధి నిర్వహించారు. తదుపరి ఉత్సవమూర్తులను రాజగోపురంలో వేంజేంపచేశారు. ఆలయ ఇన్‌చార్జి ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు తాడు లాగగా స్థానిక యాదవులు ఉట్టిని అందుకున్నారు. అనంతరం స్వామికి విశేషంగా హారతులిచ్చారు. భక్తులకు తీర్థాన్ని, వెన్న ప్రసాదాన్ని అందజేశారు. తదుపరి సింహగిరి మాడ వీధుల్లో స్వామికి తిరువీధిని నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈఉత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, పెనుమత్స శ్రీదేవివర్మ, ప్రత్యేక ఆహ్వానితుడు చందు యాదవ్ పాల్గొన్నారు.

కల్యాణం .. కమనీయం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కల్యాణం శాస్త్రోక్తంగా చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై వేంచేయజేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ **TMU University : Largest** University in India : AGBSC @ ICAR, B.Tech, B.Sc : Forensic / BDS / Pharma.D, Call : 90149 65113 [V- 270]

Real Estate

FOR SALE

■ **Sale MVP Colony (sec 1),** Sai Maruthi Residency, 1025sqft. Ph No: 9052558771 [WB-24980]

LAND FOR SALE

■ **Land for Sale 2.3 Acres Coconuts** farm Ready for Layout / farm house Gold Star Junction, Kothavalasa. 8142275083, 9441391840 [G-4962]

PLOT FOR SALE

■ కొత్తవలస గ్రామం, దొరతోట దగ్గర నవజీవన్ పబ్లిక్ స్కూల్ చేరువలో 300 Sq.yds. (45'x60') VUDA అప్రూవ్డ్ ఈస్ట్ ఫేసింగ్ ప్లాట్ అమ్మకానికి కలదు. ఫోన్ : 90380 42060 [V- 778049]

■ **GVMC పరిధిలో 5 లక్షలకే 116 గజాలు** స్టీల్‌ప్లాంట్‌కి 7 కి.మీ.లో, దువ్వాడకి 9 కి.మీ.లో, అనకాపల్లి 7 కి.మీ.లో డైరెక్ట్ పార్టీ సేల్. ఫోన్ : 62810 62644 [V- 5200]

■ 6,50,000/కే వైజాగ్ సిటీకి అతి చేరువలో సొంత ఇంటి స్థలం, మంచి ఇన్వెస్ట్‌మెంట్ & ఎక్కువ రిటర్న్స్ పొందే అవకాశాం. ఫోన్ : 96526 35807 [V-585]

Services

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సొరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితంగా ఇవ్వబడును. సంప్ర।। 9603055647, 7995392747 [G-557]

BUSINESS OFFER

■ ఫుడ్ ఐటమ్స్ తయారు చేసే వారికి 35% సబ్సిడీతో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా లోన్ ఇవ్వబడును. ఫోన్: 63015 82696 [V- 9579]

■ వెస్టన్ గ్లోబల్ ట్రేడర్స్ జీరో మార్కెట్ రిస్క్‌తో అత్యుత్తమ పెట్టుబడి ప్రణాళికలు ISO సర్టిఫైడ్ కంపెనీతో రోజువారి డబ్బు సంపాదించండి. ఫోన్ : 7288821115/1116. [HA-2585]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 76]

OLD AGE HOME

■ విశాఖ లైఫ్ కేర్ సీతమ్మధార డాక్టర్స్ కోలనీలో వృద్ధులకు, మంచాన వున్నవారికి ఆధునిక వసతులతో పాటు భోజన, డాక్టర్స్, నర్స్, ఆయా సదుపాయం. మీ ఇంటి వద్దకే మా సేవలు. ఫోన్: 98482 99968, 98487 99968 [V-11215]

T.V. REPAIR

■ **SVS TV రిపేర్స్ : 83677 16961** LED, LCD, A/C, వాషింగ్ మిషన్స్, ఫ్రిజ్, మైక్రోఓవెన్, మీ ఇంటి వద్దనే స్పాట్ రిపేర్ చేయబడును. 25 సం।। Ex, 5 సం।। వారంటీ కలదు. [V-791210]

■ **93901 94160 SK** ఎలక్ట్రానిక్స్ Enggచే. మీ ఇంటి వద్దనే TV, LCD, LED, A/C, ఫ్రిజ్, వాషింగ్ మిషన్స్, మైక్రొఓవెన్, అన్ని కంపెనీలు రిపేర్ చేయబడును. 5 సం।।లు వారంటీ. [V-5198]

Wanted

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉండి పార్ట్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 10,000- 15,000 వరకు సంపాదించే అవకాశం. ఫ్రీ బుక్‌లెట్ కొరకు. 8309974722 [G-784286]

■ భారత్ బ్యాంక్ హౌసింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో పనిచేయటుకు బ్రాంచ్ మేనేజర్స్, డ్రైవర్స్, రిసెప్షనిస్టు, టెలికాలర్స్, ప్రోసెసింగ్ మేనేజర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. ఫోన్ : 99661 28900 [V-778046]

■ విశాఖపట్నంలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (Ex.Servicemen) అర్జెంటుగా కావలెను. మంచి జీతం కలదు. ఫోన్ : 72078 98535, 86860 31666 [V- 9585]

■ MSN ఆగ్రో సీడ్స్ నందు ఇంటి వద్ద నుండి వర్క్ చేయుటకు యువతి /యువకులు (పార్ట్/ఫుల్ టైమ్) కావలెను. జీతం: 13-18 వేలు, Age: 18-35 సంప్ర: 97480 59819, 97480 59866. [C-790095]

■ **Speech therapist-1,** Occupational therapist-1, Special educator-1 Location: vizianagaram. Call : 81060 30329, 94945 89726. [S-1227261]

■ నిరుద్యోగులకు కారు టెక్నీషియన్, కారు సేల్స్ అసిస్టెంట్స్, Hotel Industry Chef, Food Associate, కంప్యూటర్, టైపింగ్, ఇంగ్లీష్ కోర్సులకు ఉచిత శిక్షణ, హాస్టలు, ఉద్యోగము కల్పించబడును. వయస్సు : 18-30సం।। వైజాగ్. ఫోన్ : 77024 76339, 90143 50860 [V- 9577]

■ **Wanted Female Teachers for** pre-primary & classes 1 st to 3rd Std. & Social & Science Teachers for Classes 4th to 7th Std. Cont : 79932 65416 [V-791138]

■ **Wanted BTech Mech. Freshers** for Trainee Role at Patancheru Hyd Manufacturers of Aerospace, Defence, Power Salary 12k. with accommodation Email: industries.bhargava@gmail.com [WB-25050]

సినిమా వార్తల కోసం లాగ్‌ఆన్ అవ్వండి
www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్
లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.325/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

పల్లెమిత్రతో సమస్యల పరిష్కారం



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ దేముడుబాబు

అరకులోయ రూరల్: పోలీసుశాఖ చేపడుతున్న పల్లెమిత్రతోనే ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం సాధ్యమని అరకులోయ సీఐ జి.దేముడుబాబు అన్నారు. మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీ యండపల్లివలస గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పల్లెమిత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న చిన్న చిన్న తగాదాలు, సమస్యలు పరిష్కార లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో విస్తృతంగా పల్లెమిత్ర నిర్వహించి, గిరిజనులకు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గిరిజనుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సతీష్, సంతోష్, సర్పంచ్ సుస్మిత, వైఎస్సార్‌సీపీ నాయకుడు యాసీన్, మహిళా పోలీసులు జయ, మహేశ్వరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ దృష్టికి దళిత సమస్యలు



చైర్మన్‌ను సన్మానిస్తున్న సమత సైనిక దళ సభ్యులు

నర్సీపట్నం: విజయవాడలో ఏపీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ మార్మడి విక్టర్ ప్రసాద్‌ను సమత సైనిక దళ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జగన్ శివ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను జిల్లా కమిటీ సభ్యులు సన్మానించారు. దళితులకు సంబంధించిన కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు శివ తెలిపారు. చైర్మన్ కలిసిన వారిలో సైనిక దళ జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, అమ్మాజీ, అర్జున్‌రావు ఉన్నారు.

సత్యవరంలో కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ



కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణలో వైస్ ఎంపీపీ రాజారామ్, కుమ్మరి శాలివాహన జిల్లా సభ్యుడు అర్జునరావు

మాడుగుల: సహజ పాండిత్యంతో హిందువుల ఆరాధ్య గ్రంథం రామాయణం రచించి రాముడికే అంకితం చేసిన కవయిత్రి మొల్ల అని కుమ్మరి శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తూరు గెడ్డప్ప, డైరెక్టర్ దేవారపు అర్జునరావు తెలిపారు. గ్రామ కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని సత్యవరంలో మొల్ల విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాష్ట్ర కోశాధికారి కాదులూరి కనకారావు, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, ఎంపీటీసీ తలారి అప్పారావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

5,176 లీటర్ల సారా ధ్వంసం



పట్టుబడిన నాటు సారాను గోతిలో పారబోస్తున్న పోలీసులు

మాడుగుల: ఎస్పీ గౌతమ్‌సాలి ఆదేశాల మేరకు అనకాపల్లి, పరవాడ సబ్ డివిజన్‌కు సంబంధించి 18 స్టేషన్లో వివిధ కేసుల్లో పట్టుబడ్డ 5,176 లీటర్ల సారా ఆదివారం పోలీసులు ధ్వంసం చేశారు. స్థానిక ఉబ్బలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన గొయ్యిలో పారబోశారు. అడిషల్ ఎస్పీ బి.విజయ భాస్కర్ మాట్లాడుతూ అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలో 722 కేసులకు సంబంధించి 4,423 లీటర్లు, పరవాడ సబ్ డివిజన్ పరిధిలో 99 కేసులకు సంబంధించి 753 లీటర్లు పారబోశామన్నారు. పరవాడ డీఎస్పీ పి. శ్రీనివాసరావు, ఏఈఎస్ ఎస్‌సీబి జె.రవికుమార్, ఎస్‌ఐలు పి. దామోదరనాయుడు, పి.రామారావు, ఆదినారాయణ రెడ్డి, ఎల్. సురేష్‌కుమార్, బి.నాగకార్తీక్, ఎ. విభీషణరావు, కె. సుధాకర్, బి.అప్పలనాయుడు, జోగారావు, కె. రవికుమార్ పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.52,150
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.47,800
వెండి(కిలో):	రూ.61,300

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.117
స్కిన్	: రూ.204
స్కిన్‌లెస్	: రూ.214

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	435.00
విజయనగరం	439.00
శ్రీకాకుళం	439.00

క్లుప్తంగా...

పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం



కార్యదర్శి వరప్రసాద్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, సచివాలయ సిబ్బంది

కొయ్యూరు: బదిలీపై వెళ్తున్న యూ.చీడిపాలెం కార్యదర్శి వరప్రసాద్‌ను సర్పంచ్ రమేష్ తదితరులు ఆదివారం సన్మానించారు. వరప్రసాద్ అందించిన సేవలను సర్పంచ్ గుర్తు చేశారు. సన్మాన గ్రహీత వరప్రసాద్ మాట్లాడుతూ ఇక్కడ పనిచేయడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఎంపీటీసీ టి.మాధవరావు, వీఆర్వో పండయ్య, సంక్షేమ శాఖ సహాయకుడు పద్మనాభం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రవీంద్రను స్వాగతం పలికారు.

అర్హులకు గృహహక్కు పత్రాలు



గిరిజన మహిళకు గృహహక్కు పత్రం అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతి

గూడెంకొత్తవీధి : ప్రభుత్వం మంజూరు చేస్తున్న జగనన్న పక్కా గృహాలను సద్వినియోగం చేసుకోవాలని వంచుల ఎంపీటీసీ సభ్యురాలు జోరంగి సరస్వతి అన్నారు. సిరిబాల గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన పక్కా గృహహక్కు పత్రాలను అందజేశారు. గ్రామంలో అర్హులైన 15 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం గృహాలను మంజూరు చేసిందని, ఆయా గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతో పాటు రాయితీపై సామాగ్రి అందజేస్తుందన్నారు. వైస్ సర్పంచ్ చల్లంగి శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు జోరంగి ప్రసాద్, బత్తుల బంగ్రరాజు, సీహెచ్ సుదర్శన్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం తగదు



ఎన్.జాన్‌బాబు

అరకులోయ రూరల్: ఆదివాసీ విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందని దండకారణ్య విద్యార్థి సమితి రాష్ట్ర ఇన్‌చార్జి ఎన్.జాన్‌బాబు అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి నిధులిస్తున్నా కొంతమంది అధికారులు ఖర్చుచేయకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఆశ్రమ పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులపై ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. దీంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడి మృతి చెందుతున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలన్నారు.

తీరనున్న వారధి కష్టాలు

- బ్రిడ్జి నిర్మాణానికి నిధులు
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రత్యేక చొరవ
- సంపంగిగెడ్డపై వచ్చే నెలలో ప్రారంభం కానున్న పనులు



సంపంగి గెడ్డపై కూలిన వంతెన(ఫైల్)

డుంబ్రిగుడ: మండలంలోని సంపంగిగెడ్డపై ఎట్టకేలకు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. హుద్‌హుద్ తుపాను లో 2014లో ఈ గెడ్డపై బ్రిడ్జి కొట్టుకుపోయింది. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మిస్తామని ప్రజా ప్రతినిధులు హామీలు ఇచ్చారు. వంతెన లేక పడుతున్న ఇబ్బందులపై స్థానిక గ్రామస్తులు టీడీపీ నాయకులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. సంపంగిగెడ్డపై బ్రిడ్జి నిర్మిస్తే అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, అనంతగిరి మండలాల్లోని సుమారు 122 గిరిజన గ్రామాలకు ఎంతో ఉపయోగపడుతుంది. వర్షాలు కురిసినపుడు గెడ్డ ఉధృతితో ఆయా ప్రాంతాల నుంచి కించుమండ, పాడేరు, అరకులోయ ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో ఆయా గ్రామస్తులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. గిరిజన సహకార సంస్థ నుంచి బియ్యం తరలించేందుకు కూడా అవకాశం లేకుండా పోయే పరిస్థితి ఉంది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏజెన్సీ అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఈ నేపథ్యంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆయా గ్రామాల్లో పర్యటించి, వంతెన సమస్యపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతిపాదనలు చేయించారు. సంపంగిగెడ్డపై వంతెన కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వంతెన కోసం ప్రత్యేక దృష్టి సారించారు.

నిధులు మంజూరు..

ఆనందంలో గిరిజనులు

బ్రిడ్జి నిర్మాణానికి ఎస్టీసీ నిధులు నుంచి రూ.4 కోట్లు మంజూరైంది. బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత సెప్టెంబర్ నెలలో పనులు ప్రారంభించనున్నారు. 2023 మే నాటికి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. టీడీపీ హయాంలో అపరిష్కృతంగా వంతెన సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేసింది. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు స్థానిక గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 11 పంచాయతీలకు చెందిన 122 గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కితలంగి సర్పంచ్ సుబ్బారావు తన సొంత నిధులు రూ.1.50లక్షలతో సంపంగిగెడ్డ సమీపంలో తాత్కాలికంగా రోడ్డు కూడా వేయించారు. వాహనాలు రాకపోకలు సాగేవి. అయితే భారీ వర్షాలు కురవడంతో రోడ్డు కొట్టుకుపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం నిధులు మంజూరై..పనుల శ్రీకారానికి అధికారులు చర్యలు తీసుకోవడంతో గిరిజనులు తమ కష్టాలు తీరనున్నట్టు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.4 కోట్లు మంజూరు



గ్రామాల్లో పర్యటించినపుడు ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ నేపథ్యంలో కొన్నేళ్లుగా సంపంగిగెడ్డపై వంతెన లేక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించాను. సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి, రూ.4కోట్లు నిధులు మంజూరు చేయించారు. త్వరలో పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశించాం.

– చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

త్వరలో పనులు ప్రారంభం



సంపంగిగెడ్డపై వంతెన నిర్మాణం కోసం ఈ నెలాఖరులో టెండర్ ప్రక్రియ పూర్తవుతుంది. సెప్టెంబర్ రెండో వారంలో పనులు ప్రారంభిస్తాం. 2023 మే నాటికి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తాం.

– పి.మధు, డీఈ (పంచాయతీ రాజ్), అరకులోయ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



గత టీడీపీ హయాంలో నాయకులు, ప్రజా ప్రతినిధులకు బ్రిడ్జి కోసం ఎన్నిమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలో తరువాత బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేసింది. ఈ మేరకు 122 గ్రామాల తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. వంతెన కోసం విశేష కృషి చేసిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. గ్రామస్తులందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– సుబ్బారావు, సర్పంచ్, కితలంగి

నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: మండలంలోని ముర్లవానిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గుబ్బల మంగమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ మేరకు ఆదివారం రాజవొమ్మంగి పుర వీధుల్లో గ్రామానికి చెందిన పూజారులు పోతురాజు, నరసింహమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు జరిగింది. సోమవారం 9.09 గంటలకు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అల్లూరి జిల్లా రేవళ్ల గ్రామానికి చెందిన అద్దేపల్లి నూకరాజు గ్రామపెద్దల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్టు పూజారి పోతురాజు చెప్పారు.

ఎమ్మెల్యేపై విమర్శలు తగవు



ఉల్వాసింగి ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిదొర

జి.మాడుగుల: అల్లూరి సీతారామరాజు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి నిరంతరం గిరిజన ప్రాంత అభివృద్ధి, ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరిస్తుంటే ప్రతిపక్షాలు ఆరోపణ లు, విమర్శలు చేయడం తగద ని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఉల్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతం చేసి గిరిజనాభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పనిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడం తగదని, ఇది సరికాదన్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిపై, వైఎస్సార్‌సీపీపై ఇకపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

ఇలాగైతే ఎలా?



అసంపూర్తిగా దర్శనమిస్తున్న ఐసీడీఎస్ భవనం



తాళం వేసి ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం

గూడెంకొత్తవీధి : లక్షలాది రూపాయలు వెచ్చించి మండల కేంద్రంలో నిర్మించిన గిరిజన సంక్షేమ శాఖకు చెందిన ఓ కార్యాలయ భవనం ఎప్పుడు మూతపడి దర్శనమిస్తోంది. ఐదేళ్ల క్రితం రూ.25లక్షలతో ఈ భవనం నిర్మాణం చేపట్టి ప్రారంభించారు. అయితే ప్రస్తుతం వినియోగం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో పాటు ఐసీడీఎస్ భవన నిర్మాణం నిలిచిపోవడంతో అద్దె భవనంలో కార్యాలయం, గొడౌన్‌ను కొనసాగిస్తున్నారని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయా భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబుతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు మంపలో అల్లూరికి నివాళి

కొయ్యూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చింతపల్లి పోలీసు స్టేషన్‌పై దాడి చేసి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మంపలో 19 అడుగుల అల్లూరి విగ్రహం వద్ద నివాళి తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అల్లూరి యువజన సంఘం నేత బూర్గల య్యా తెలిపారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపకులు పడాల వీరభద్రరావు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

క్లుప్తంగా...

అల్లూరి సభను విజయవంతం చేయాలి

• ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం అల్లూరి సీతారామరాజు శతాబ్ది వేడుకలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొట్టిగుల్లి భాగ్యలక్ష్మి కోరారు. సమావేశ స్థలాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. స్థానిక పోలీసు స్టేషన్‌పై అల్లూరి సీతారామరాజు దాడి చేసి వందేళ్లు అయిన సందర్భంగా భారీ సభ నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. సమావేశానికి కేంద్ర, రాష్ట్రమంత్రులు హాజరవుతారన్నారు. మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య,సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీడీవో లాలం సీతయ్య, ఎంపీటీసీ దార లక్ష్మి పాల్గొన్నారు.

నేడు మన్యం తిరుగుబాటు శత జయంత్యుత్సవాలు


• చింతపల్లికి రానున్న కేంద్రమంత్రులు
• ఏపీ, తెలంగాణ క్షత్రియ సేవా సమితి



మాట్లాడుతున్న ఏపీ, తెలంగాణ క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పేరిచర్ల నాగరాజు

నర్సీపట్నం: చింతపల్లిలో మన్యం తిరుగుబాటు శత జయంత్యుత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఉత్సవాలకు కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా, ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు, ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి హాజరు కానున్నారు. ఈ మేరకు ఆదివారం నర్సీపట్నంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పేరిచర్ల నాగరాజు మాట్లాడుతూ అమాయక గిరిజనులపై పెరిగిపోతున్న తెల్లదొరల అకృత్యాలకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో గాం గంటందొర, మల్లుదొర, గోకిరి ఎర్రెసు, ఎండు పడాల్ వంటి వీరులతో 1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీసు స్టేషన్‌పై మెరుపు దాడితో చారిత్రాత్మకమైన మన్యం తిరుగుబాటు మొదలయిందన్నారు. వరుస దాడులతో బ్రిటీష్ సైన్యాన్ని ఉక్కిరి బిక్కిరి చేశారన్నారు. నేటితో మన్యం తిరుగుబాటు ఉద్యమానికి వందేళ్లు నిండుతున్నాయన్నారు. ఈ సందర్భంగా మన్యం తిరుగుబాటు ఉద్యమం ఆనవాళ్లను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శత జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అల్లూరి స్మారక ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరుకు అంగీకరించాయన్నారు. పోలీసు స్టేషన్, అల్లూరి లొంగిపోయిన మంప చెరువును సుందరీకరణ చేసి ఒక మంచి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నామన్నారు. వీటన్నింటినీ స్మారక మందిరాలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరుకు అంగీకరించిందన్నారు. దీంతోపాటు క్షత్రియ సేవా సమితి విజ్ఞప్తి మేరకు అల్లూరికి ప్రధాన అనుచరుడైన గంటందొర వారసులైన 11 మంది కుటుంబాలకు నాగార్జున కన్స్‌ట్రక్షన్ కంపెనీ అధినేత డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నడింపాలెం శివారు లంకలవీధిలో ఉచితంగా నిర్మించి ఇస్తారన్నారు. ఉత్సవాల్లో భాగంగా గృహ నిర్మాణ పనులను కేంద్ర మంత్రులు ప్రారంభిస్తారన్నారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, ఏపీ, తెలంగాణ క్షత్రియ సేవా సమితి ప్రధాన కార్యదర్శి నానీరాజు, క్షత్రియ పరిషత్ నాయకులు శ్రీరామరాజు, రాజాసాగి లక్ష్మీనర్సింహరాజు, గణపతి బంగార్రాజు, రాధాకృష్ణరాజు, చక్రపాణిరాజు, శివాజీ రాజు, జంపన నాగేంద్రరాజు పాల్గొన్నారు.

చాపరాయిలో పర్యాటకుల సందడి



చాపరాయిలో సందడిగా ఉన్న పర్యాటకులు

డుంబ్రిగుడ: మండలంలోని చాపరాయి జలపాతం వద్ద పర్యాటక ప్రాంతాలు తిలకించేందుకు మైదాన ప్రాంతం నుంచి ఆదివారం పెద్ద ఎత్తున పర్యాటకులు తరలి రావడంతో సందడిగా మారింది. కుటుంబ సమేతంగా చాపరాయి గెడ్డ వద్ద స్నానాలు చేశారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఇక్కడ చిరు వ్యాపారుల వద్ద పసుపు, అల్లం, ఇతర సామగ్రి తోపాటు బ్యేంబూ చికెన్, కవ్వ పుల్లలు కొనుగోలు చేశారు. దీంతో మంచి ఆదాయం వచ్చిందని చిరు వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఇంజినీరింగ్, ఫార్మసీ కౌన్సెలింగ్

మురళీనగర్ (విశాఖ ఉత్తర): ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్టు ఎంపీసీ స్ట్రీమ్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఇంజినీరింగ్ , ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి కౌన్సిలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమవుతుందని కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ జీవీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. నగరంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

షెడ్యూలు ఇలా.. : ముందుగా అభ్యర్థులు వెబ్‌సైట్ తెరిచి దరఖాస్తులో అవసరమైన సమాచారం పొందుపరిచిన తర్వాత అందులో అడిగిన సర్టిఫికెట్లను స్కాన్ చేసి సబ్‌మిట్ చేయాలి. ఫీజు చెల్లింపునకు సంబంధించి ఎస్సీ/ఎస్టీలకు రూ.600లు, ఇతరులకు రూ.1200లు ఆన్‌లైన్లో చెల్లించాలి. ఈనెల 22వ తేదీనుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో సమర్పించిన సర్టిఫికెట్లను హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లోనే పరిశీలిస్తారు. సర్టిఫికెట్లను ఈనెల 31వ తేదీ వరకు అప్‌లోడ్ చేసుకోవచ్చు. వీటిలో ఏమైనా సమస్యలు ఉంటే అభ్యర్థి మొబైల్‌కు ఫోన్ చేసి సమాచారం అందిస్తారు. వీరు హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకోవాలి.

ఆప్షన్ల ఎంపిక : ఈనెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. సెప్టెంబర్ 3వ తేదీన ఆప్షన్ల మార్పిడి, 6వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు పొందిన వారు 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో జాయినింగ్‌కు సంబంధించి సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

ప్రత్యేక కేటగిరి : పీహెచ్/ఎన్‌సీసీ/క్యాప్/స్పోర్ట్సు/ ఆంగ్లో ఇండియన్స్ కేటగిరి విద్యార్థులు తప్పని సరిగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో విజయవాడ బెంజ్ సర్కిల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి నేరుగా హాజరై సర్టిఫికెట్లు పరిశీలించుకోవాలి. ముందుగా వీరు ఈనెల 22వ తేదీ నుంచి వీరు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల అప్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం ఈనెల 27వ తేదీనుంచి వారికి కేటాయించిన షెడ్యూలు ప్రకారం విజయవాడ వెళ్లి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలి. వెబ్‌సైట్: https:// sche. ap. gov. in.

దివ్యాంగులు.. క్రీడల్లో ఘనులు

ఉత్సాహంగా స్పెషల్ ఒలింపిక్స్ పోటీలు



పోటీలో దివ్యాంగ విద్యార్థులు



పరుగు పందెంలో పోటీపడుతున్న దివ్యాంగులు



గాల్లోకి బెలూన్లను విడిచి పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు



జావెలిన్ త్రో చేస్తున్న దివ్యాంగ క్రీడాకారుడు

విశాఖ స్పోర్ట్స్: వ్యాంగుల స్పెషల్ ఒలింపిక్స్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. నార్త్‌కోస్టల్ ఆంధ్రకు చెందిన దివ్యాంగ ప్రత్యేక బాల బాలికలు ఫీల్డ్‌లో డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, షాట్‌పట్‌తో పాటు ట్రాక్‌లో పరుగు పోటీల్లో పాల్గొన్నారు. అంధ, బధిరులు, మానసిక, అంగవైకల్య దివ్యాంగులకు 12–20 ఏళ్ల వారికి పలు తరగతుల్లో బాల బాలికలకు ఈ పోటీలు పోర్ట్ స్టేడియంలో జేసీటీ విశాఖ ఆధ్వర్యంలో స్పెషల్ ఒలింపిక్స్ పేరిట వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. అంధ మహిళల షాట్‌పుట్‌లో సత్యవతి విజేతగా నిలిచింది. 50 మీటర్ల పరుగులో మిక్కా తొలి స్థానంలో నిలవగా 12–20 ఏళ్ల విభాగంలో కమల విజేతగా నిలిచింది. పాక్షిక అంధమహిళా విభాగంలో సీహెచ్ రమ్య విజేతగా నిలవగా 20+లో జ్యోతి విజేతగా నిలిచింది. వంద మీటర్ల 20+ కేటగిరి బధిరుల విభాగంలో భార్గవ్, -20లో శంకరరావు తొలి స్థానాల్లో నిలవగా... పాక్షిక అంధుల 50 మీటర్ల పరుగులో బి.రవి, 100 మీటర్ల పరుగులో జి.సూర్య విజేతలుగా నిలిచారు. బధిరుల 20+కేటగిరి షాట్‌పుట్‌లో ఎ.గౌరినాయుడు, పాక్షిక అంధ 8–12 ఏళ్ళ కేటగిరీలో 50 మీటర్ల పరుగు విభాగంలో ఎస్.మిక్కా, 12–20 బాలబాలికల షాట్‌పుట్‌లో బి.లక్ష్మణరావు, వి.శరిత విజేతలుగా నిలిచారు. బాలికల 50 మీటర్ల పరుగులో వి.దివ్య, 100 మీటర్లలో ఎస్.భార్గవి, కె.భవాని, జష్మా ఆయా కేటగిరిల్లో తొలి స్థానాల్లో నిలిచారు. 20+ బధిర బాలికల వంద మీటర్ల పరుగులో కె.తులసీ విజేతగా నిలిచింది. బాలుర 50 మీటర్ల పరుగులో బి.వినోద్, పి.మణికంఠ ఆయా విభాగాల్లో తొలి స్థానాల్లో నిలవగా 100మీటర్ల పరుగులో మానసిక వికలాంగుల విభాగంలో ఆదిత్య మణికంఠ, బధిరుల విభాగంలో చక్రధర్ తొలి స్థానాల్లో నిలిచారు. బి.జ్యోతి, సీహెచ్ రమ్య, జి.ఆదిత్య, పి.అనిల్‌కుమార్ ఆయా విభాగాల్లో విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో రైల్వే డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పత్తి, టీడీపీ నేత భరత్ తదితరులు పాల్గొన్నారు.